సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 31 । డిసెంబర్ । 2024

● న్యూ ఇయర్‌కు సిటీ సిద్ధం




31st DEC చిల్ & సేఫ్

It's Party Time

- రిసార్ట్స్, హోటళ్లు ముందస్తు బుకింగ్
- బిర్యానీ సెంటర్లలో కాంబో ఆఫర్లు
- కేక్‌లు, బొకేలకు డిమాండ్
- మద్యం షాపుల్లో ఫుల్ స్టాక్

కొత్తగా ఇంటికి వచ్చే అతిథిని ఎదురేగి ఆహ్వానించడానికి ఆ ఇంటికి సంబంధించిన వాళ్లు మాత్రమే రెడీ అవుతారు. కాని ఇప్పుడొచ్చే చుట్టం అందరిదీ. విశ్వవ్యాప్త అతిథి. ఏడాది పాటు వద్దన్నా మనతోనే ఉంటుంది. అందుకే విశ్వమంతా ఈ సంబరం... నగరాన్ని తాకుతోంది అంబరం. అదే నూతన సంవత్సర సరంభం.

ఏయూక్యాంపస్ : సిటీలో న్యూ ఇయర్ జోష్ మొదలైంది. సెలబ్రేషన్స్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే రిసార్ట్‌లు, హోటళ్ల వేడుకలకు సిద్ధమయ్యాయి. ఈవెంట్ మేనేజర్లు కూడా కొత్త ఏడాది వేడుకలకు భారీ ఎత్తున ప్లానింగ్‌తో రెడీ అయ్యారు. పాపులర్ సింగర్స్, డీజేలు, మ్యూజిక్ డైరెక్టర్లు, సినిమా సెలబ్రిటీలతో ఈవెంట్లు, విందులు, వినోదాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో 2025కు ఆహ్వానం పలకనున్నారు.



హోటళ్లు ఫుల్

నగరంలో త్రీస్టార్, ఫోర్ స్టార్, ఫైవ్ స్టార్ హోటళ్లు దాదాపు 30 వరకు ఉన్నాయి. వీటిలో 2,500 గదుల వరకు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే ఇవన్నీ అతిథులతో, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే పర్యాటకులతో నిండిపోయాయి. ప్రధానంగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్, కోల్‌కత్తా నుంచి పెద్దసంఖ్యలో పర్యాటకులు వచ్చి విశాఖ హోటళ్లలో దిగారు. వీరంతా ఇక్కడే న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోనున్నారు. స్టార్ హోటళ్ల ప్రత్యేకమైన థీమ్‌తో వేడుకలను నిర్వహిస్తున్నాయి. వీటిలో కపుల్‌కి రూ.10 వేల నుంచి రూ.18 వేల వరకు చార్జ్ చేస్తున్నారు. క్యాండిల్ లైట్ డిన్నర్, డీజే, ఎంటర్‌టైన్‌మెంట్, గాలా డిన్నర్, లైవ్ మ్యూజిక్, డ్యాన్స్‌లు వంటివి ఏర్పాటు చేస్తున్నారు. చిన్నారుల కోసం ప్రత్యేకంగా మ్యాజిక్ షోలు వంటివి నిర్వహిస్తున్నారు.

బిర్యానీ పాయింట్లు..

మధ్యతరగతి వారికోసం ప్రత్యేకంగా బిర్యానీ పాయింట్లు వెలుస్తున్నాయి. నగరంలో పాపులర్ అయిన ఫుడ్ స్టాల్స్, హోటల్స్‌తో పాటు ఆయా ప్రాంతాల్లో చిన్నపాటి ఫుడ్ స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. కాంబో ఆఫర్లు ప్రకటిస్తూ ఆకర్షిస్తున్నారు. మంగళవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు వీటి విక్రయాలు జోరుగా జరుగుతాయి.

ఫుల్ కిక్

న్యూ ఇయర్‌లో మద్యం కూడా ప్రధానమైనదే. 31వ తేదీ రాత్రి విక్రయాలు గణనీయంగా పెరుగుతాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని మద్యం షాపులు, బార్‌లు అదనంగా స్టాక్‌ని ముందస్తుగానే తెచ్చి సిద్ధంగా ఉంచుకున్నాయి. మద్యం ప్రియులకు తనివితీరా అందించేందుకు ఇవి ఫుల్‌స్టాక్‌తో కళకళలాడిపోతున్నాయి.

స్వీట్లు, గిఫ్ట్ షాపుల వద్ద సందడి

నూతన సంవత్సరం రోజు నూతన వస్త్రాలు ధరించడం, స్నేహితులకు గిఫ్టులు, పూల బొకేలు, పళ్లు, స్వీట్లు ఇవ్వడం ఆనవాయితీ. వస్త్ర దుకాణాలు, గిఫ్టషాపులు, స్వీట్ షాపుల్లో జోరుగా విక్రయాలు జరుగుతున్నాయి. బేకరీలు రకరకాల కేక్‌లు, స్వీట్లు సిద్ధం చేసి నగరవాసులకు ఆహ్వానం పలుకుతున్నాయి. నర్సరీల నిర్వాహకులు ప్రత్యేకమైన స్టాల్స్ ఏర్పాటు చేసి పూల మొక్కలు, అలంకరణ మొక్కలు అందుబాటులో ఉంచారు. పువ్వులు, పండ్ల దుకాణాల వద్ద సందడి నెలకొంది.



ట్రాఫిక్ ఆంక్షలు

విశాఖ సిటీ: నగరంలో 31వ తేదీ రాత్రి 8 నుంచి తెల్లవారు 5 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు.



- వేమన మందిరం నుంచి డీఎల్‌ఓ జంక్షన్ వరకు గల ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ఆయా సమయాల్లో రాకపోకలు అనుమతించరు.
- జనవరి 1వ తేదీన సంపత్ వినాయక గుడి వద్ద వాహనాలకు పూజ చేసుకునేందుకు వాహనాలను గోకీ సన్స్ నుంచి కళామందిర్ వరకు రోడ్డుకు ఎడమ వైపున పార్కింగ్ చేసుకోవాలి.
- పార్క్ హోటల్ నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు నిర్ణీత సమయంలో వాహనాల రాకపోకలు, పార్కింగ్‌లకు అనుమతిలేదు.
- 31వ తేదీ రాత్రి 8 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 5 గంటల వరకు బీఆర్‌టీఎస్ రోడ్ హనుమంతవాక నుంచి అడవివరం జంక్షన్, గోశాల జంక్షన్ నుంచి వేపగుంట, పెందుర్తి నుంచి ఎన్ఏడీ జంక్షన్ మీదుగా కాన్వెంట్ జంక్షన్ వరకు, అలాగే మద్దిలపాలెం నుంచి రామాటాకీస్ బీఆర్‌టీఎస్ మధ్య లైన్, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అండర్‌పాస్ మూసివేస్తారు.



మద్యం తాగి వాహనం నడిపితే కేసులు

మద్యం తాగి వాహనం నడిపితే రూ.10 వేలు జరిమానా, 6 నెలల జైలుశిక్ష తప్పదు. బహిరంగంగా మద్యం సేవించే వారిపై ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. బైక్‌పై ట్రిపుల్ రైడింగ్, సైలెన్సర్ తీసి శబ్ద కాలుష్యం చేయడం, రాంగ్ రూట్లలో డ్రైవింగ్, బైక్‌పై విన్యాసాలు, జిగ్ జాగ్ డ్రైవింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, రాంగ్ పార్కింగ్, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్, ట్రాఫిక్ సిగ్నల్స్ అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటారు.

బీచ్ రోడ్డులో వాహనాలకు అనుమతి లేదు

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా బీచ్ రోడ్డులో వాహనాలకు అనుమతి లేదని సీపీ తెలిపారు. బీచ్ పరిసర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంటుందన్నారు. బీచ్‌లో బాణసంచా కాల్చరాదని, సందర్శకులు రాత్రి సమయంలో సముద్ర స్నానానికి దిగరాదన్నారు. నోవాటెల్ హోటల్ జంక్షన్, ఆర్‌కే బీచ్, భీమిలి, గాజువాక, పెందుర్తి పరిసరాల్లో షీ-టీమ్స్ అందుబాటులో ఉంటాయని తెలిపారు.

హోటల్స్‌లో రద్దీ కొనసాగుతోంది..



నగరంలో హోటల్స్‌లో రద్దీ కొనసాగుతోంది. ఎక్కువ మంది ముందుగానే గదులను బుక్ చేసుకున్నారు. కొన్ని హోటళ్లు ప్రత్యేకమైన థీమ్‌తో న్యూ ఇయర్ వేడుకలను ప్లాన్ చేస్తున్నాయి. నగరవాసులు తమ అభిరుచికి అనుగుణంగా నచ్చిన చోట వేడుకలు జరుపుకోవడానికి సిద్ధమవుతున్నారు. డిసెంబర్ నెలలో సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్న వారికి కొంత వెసులుబాటు, సెలవులు ఉంటాయి. దీంతో వీరు విశాఖ నగరంతో పాటు, చుట్టుపక్కల పర్యాటక ప్రాంతాలను సందర్శించడానికి వెళ్తుంటారు.

-ఎం.వి.పవర్ కార్తీక్, ఉపాధ్యక్షుడు, హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్

ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితా

స్వల్పంగా పెరిగిన ఓటర్లు



మహారాణిపేట : ఉత్తరాంధ్ర టీచర్ ఎన్నికలకు సంబంధించి తుది ఓటర్ల జాబితాను విడుదల చేశారు. ప్రస్తుతం ఉత్తరాంధ్ర జిల్లాల్లో 21,555 మంది ఓటర్లు ఉన్నారు. గత ఎమ్మెల్సీఎన్నికల్లో 19,523 మంది ఓటర్లు ఉండగా..స్వల్పంగా పెరిగారు. గత నెల 23న ప్రకటించిన జాబితాలో మొత్తం 15,287 మంది ఓటర్లలో పురుషులు 9,638 మంది, స్త్రీలు 5,649 మంది ఉన్నారు. ఆ తర్వాత ఆన్‌లైన్ ద్వారా 1,930 దరఖాస్తులు, ఆఫ్‌లైన్ ద్వారా 4,064 దరఖాస్తులు స్వీకరించారు. అదనంగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తుది జాబితాను సోమవారం విడుదల చేశారు. ప్రస్తుతం ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఉన్న పాకలపాటి రఘు వర్మ పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 29 నాటితో పూర్తవుతోంది. వచ్చే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నాటికి ఓటర్ల నమోదు ప్రక్రియ నిర్వహిస్తారు.

ప్రస్తుత ఓటర్లు

జిల్లా	పురుషులు	మహిళలు	మొత్తం
శ్రీకాకుళం	3,275	1,554	4,829
విజయనగరం	3,100	1,837	4,937
మన్యం పార్వతీపురం	1,532	730	2,262
అల్లూరి సీతారామరాజు	891	557	1,448
విశాఖపట్నం	2,403	2,874	5.277
అనకాపల్లి	1,747	1,055	2,802
మొత్తం	12,948	8,607	21,555

పకడ్బందీగా శారీరక దారుఢ్య పరీక్షలు



పరుగు పోటీలో పాల్గొన్న అభ్యర్థులు

ఆరిలోవ: ఉమ్మడి విశాఖ జిల్లాలో కానిస్టేబుల్ అభ్యర్థులకు కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో శారీరక దారుఢ్య పరీక్షలు సోమవారం నిర్వహించారు. ప్రాథమిక రాత పరీక్షలో మొత్తం 11,568 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. మొదటి రోజు 600 మందికి గానూ 233 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి, అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంతో సీసీ కెమెరాల నడుమ పారదర్శకంగా పరుగు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీల నిర్వహణలో అడిషనల్ ఎస్పీ ఎల్.మోహనరావు, ఎస్బీ డీఎస్పీ బి.అప్పారావు, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ టి.లక్ష్మి, సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ టి.కల్యాణి పాల్గొన్నారు.

ఏయూ శతాబ్ది ఉత్సవాలకు ప్రధాని రాక



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరుకానున్నట్లు వీసీ ఆచార్య జి.శశిభూషణరావు తెలిపారు. వర్సిటీ 2025 సంవత్సర క్యాలెండర్‌ను రిజిస్ట్రార్ ధనుంజయరావు, ఇతర ఆచార్యులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ శతాబ్ది సంవత్సరాన్ని పురస్కరించుకుని ఏయూలో ప్రత్యేకంగా సెంటినరీ టవర్, సెంటినరీ పార్కులను నిర్మించనున్నట్లు తెలిపారు. 2026 జనవరి 26న సెంటినరీ వేడుకల ప్రధాన కార్యక్రమానికి ప్రధాని ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. 2025 ఏప్రిల్ 26 నుంచి ప్రారంభమయ్యే శతాబ్ది సంవత్సరాన్ని పురస్కరించుకుని విభిన్న సదస్సులు, వర్క్ షాప్‌లు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎస్.ధనంజయరావు, అకడమిక్ డీన్ ఆచార్య కె.ఈశ్వర్ కుమార్, ఏయూ కళాశాలల ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం న్యూ ఇయర్ క్యాలెండర్లను పంపిణీ చేశారు.

సీఐడీ అధికారులకు మూడు అవార్డులు

ఆరిలోవ: సీఐడీ విశాఖ రీజియన్ కార్యాలయానికి యాన్యువల్ రోలింగ్ అవార్డులు లభించాయి. మొట్టమొదటిసారిగా ఈ అవార్డులను సీఐడీ అడిషనల్ డీజీపీ ప్రకటించారు. ఇందులో భాగంగా విశాఖ రీజియన్ కార్యాలయానికి మూడు అవార్డులు వరించాయి. వాటిలో బెస్ట్ ఇన్ ఇన్వెస్టిగేషన్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఇన్‌స్పెక్టర్ ఎం.శేషుకు, బెస్ట్ ఇన్ ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఇన్‌స్పెక్టర్ కె.పైడిపునాయుడుకు ఈ అవార్డులు లభించాయి. వీరితో పాటు ఉత్తమ రీజనల్ ఆఫీస్‌కు గాను విశాఖ రీజియన్ కార్యాలయం అధికారి ప్రేమ్ కాజల్‌కు రోలింగ్ అవార్డు లభించింది. అవార్డులను సోమవారం మంగళగిరిలో అందజేసినట్టు సీఐడీ రీజినల్ అధికారులు తెలిపారు. ప్రశంసా పత్రాలు, షీల్డ్, నగదు అందుకున్నారన్నారు.

నెలలో డ్రోన్ పోలీసింగ్

- నేర నియంత్రణకు చేపట్టిన చర్యలతో సత్ఫలితాలు
- పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: విశాఖ బ్రాండ్ ఇమేజ్ పెరగాలంటే నేర నియంత్రణ అవసరమని, అందుకు తగ్గట్టుగా చేపట్టిన చర్యలు సత్ఫలితాలిచ్చాయని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. మరో నెల రోజుల్లో డ్రోన్ పోలీసింగ్ కూడా అందుబాటులోకి వస్తుందని వెల్లడించారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో మీడియాకు గత మూడేళ్లుగా నగరంలో నేరాల వివరాలను వెల్లడించారు. నగరంలో ఏటా నేరాలు తగ్గుముఖం పట్టడం శుభపరిణామని తెలిపారు. తాను సీపీగా బాధ్యతలు చేపట్టిన తరువాత తీసుకున్న సరికొత్త నిర్ణయాలతో మంచి ఫలితాలు వచ్చాయని వివరించారు. గత ఆరు నెలల్లో నగరంలో వ్యాపార సంస్థలు, వ్యాపారులు, అపార్ట్‌మెంట్ల ద్వారా 7,526 సీసీ కెమెరాలు, 1,442 చీకటి ప్రాంతాల్లో లైట్లు, 126 నైట్ పెట్రోలింగ్ పార్టీలు పెంపు, 272 మందిపై హిస్టరీ షీట్లు తెరవడం, బహిరంగంగా మద్యం సేవించిన 5,139 మందిపై కేసుల నమోదు, 1272 ప్రాంతాల్లో తప్పుల తొలగింపు.. ఇలా అనేక చర్యలతో నగరంలో నేరాలు తగ్గుముఖం పట్టాయని చెప్పారు. ఇదే స్ఫూర్తితో కొత్త సంవత్సరంలో కూడా మరిన్ని సరికొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని చెప్పారు. ఇందుకు అవసరమైన సాంకేతికతను అందిపుచ్చుకునే విషయంపై దృష్టి పెడతామన్నారు. గత ఐదు నెలల్లో 9,456 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో నేరస్తులను గుర్తించడంలో కీలకంగా మారాయన్నారు. అలాగే నగరంపై నిఘా పెంచేందుకు ఐదు నెలల్లోనే 126 పెట్రోలింగ్ పార్టీలను పెంచినట్లు తెలిపారు. ఈ ఏడాదిలో 175 మంది సస్పెక్ట్ షీట్, 176 మందిపై రౌడీ షీట్, 35 మందిపై పడోఫైల్ షీట్, 36 మందిపై డ్రగ్స్, ముగ్గురిపై భూ ఆక్రమణ, ఒకరిపై సైబర్ బుల్లీ షీట్స్‌ను నమోదు చేసినట్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..

భారీగా ఎన్‌డీపీఎస్ కేసులు

గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల కేసులు భారీగా పెరిగాయి. 2023లో 235 కేసులు నమోదు కాగా.. ఈ ఏడాదిలో 313 కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో 927 మంది నిందితుల పాత్ర ఉన్నట్లు గుర్తించగా 718 మందిని అరెస్టు చేశారు. ఇందులో 5024.93 కిలోల గంజాయి, 3518 మత్తు ట్యాబ్లెట్లు, 9.144 గ్రాముల ఎండీఎంఏ పౌడర్, 2 గంజాయి మొక్కలు, 132 గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా నియంత్రణకు డెకాయ్ పార్టీలు, డైనమిక్ చెక్ పోస్టుల ఏర్పాటు, రైల్వే స్టేషన్, బస్ కాంప్లెక్స్, పార్సిల్ కేంద్రాల్లో స్నిఫర్ డాగ్స్ బృందాలతో నిరంతర తనిఖీలు చేపడుతున్నారు.

స్వల్పంగా రోడ్డు ప్రమాదాలు తగ్గుదల

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసులు చేపట్టిన చర్యలతో నగరంలో రోడ్డు ప్రమాదాలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టడంతో పాటు పనిచేయని 66 ట్రాఫిక్ సిగ్నల్స్, 86 పాదచారుల సిగ్నల్స్ పునరుద్ధరణ చేపట్టారు. 2022లో 1353, 2023లో 1180, 2024లో 1094 రోడ్డు ప్రమాదాలు జరిగాయి.

తగ్గిన సైబర్ క్రైమ్ కేసులు

నగరంలో సైబర్ క్రైమ్ కేసులు తగ్గుముఖం పట్టాయి. సైబర్ నేరగాళ్లు దోచుకున్న రూ.20.42 కోట్లను పోలీసులు స్తంభింపచేశారు. గతేడాది 419 కేసులు నమోదు కాగా రూ.4.04 కోట్లు పలు బ్యాంకులో ఫ్రీజ్ చేశారు. ఈ ఏడాదిలో 364 కేసులు నమోదయ్యాయి. ఇందులో రూ.2.02 కోట్లు బాధితులకు అప్పగించారు.

యాచకులు, హిజ్రాలకు పునరావాసంపై దృష్టి

నగరంలో యాచకులు లేకుండా చేసే విషయంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇప్పటికే నగరంలో ఉన్న యాచకులు, హిజ్రాల వివరాలను సేకరించే పనిలో ఉన్నారు. వారి జన్మస్థలం, కుటుంబ సభ్యులు, ఇతర వివరాలను తెలుసుకొని వారికి అప్పగించాలని భావిస్తున్నారు. ఎవరూ లేని పక్షంలో వారికి ఏ విధంగా పునరావాస, ఉపాధి అవకాశాలు కల్పించాలన్న అంశంపై త్వరలోనే అన్ని శాఖల అధికారులు, ఎన్‌జీఓ సంస్థలతో చర్చించి ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు. అలాగే కొంత మంది హిజ్రాలు దౌర్జన్యంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో త్వరలో వారితో సమావేశం ఏర్పాటు చేసి తగిన సూచనలు అందించాలని భావిస్తున్నారు.

నేరాలు	2022	2023	2024
హత్యలు	39	23	22
లాభం కోసం హత్య	1	2	1
ప్లాన్‌తో హత్య	9	10	7
అల్లర్లు	0	2	2
కిడ్నాప్	32	24	21
దాడి	534	399	451

పోలీసులకు ఆరోగ్య తనిఖీలు

నగర పోలీసులు, వారి కుటుంబ సభ్యులకు కొత్త ఏడాది తొలి వారంలోనే ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రధానంగా గుండె సంబంధిత సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తల కోసం సీటీ యాంజియోగ్రామ్ పరీక్షలు నిర్వహించనున్నారు. పోలీసులతో పాటు వారి కుటుంబ సభ్యులకు కూడా ఈ పరీక్షలు చేయించనున్నారు.

'నాకు పిచ్చా' అన్నారు..

ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు స్వయంగా నా నంబర్ ఇవ్వడంతో తన బ్యాచ్‌మేట్స్ అందరూ 'నీకు పిచ్చా.. సొంత నంబర్ ఇస్తున్నావ్' అని అన్నారని సీపీ నవ్వుకుంటూ చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారానికి, విశాఖలో నేర నియంత్రణే లక్ష్యంగా తాను ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు చెప్పారు.

	2022	2023	2024
డ్రంక్ అండ్ డ్రైవ్	2,08,541	1,44,907	1,63,913
అతివేగం	9,667	21,376	33,707
హెల్మెట్ ధరించకపోవడం	4,11,348	3,71,245	5,03,065
సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడం	5,928	2,774	7,992
మైనర్ డ్రైవింగ్	106	201	1,298
రాంగ్ పార్కింగ్	71,682	39,340	80,487
ట్రిపుల్ రైడింగ్	13,927	17,046	20,954
ఫైన్లు	రూ.17.01 కోట్లు	16.22 కోట్లు	25.67 కోట్లు
డ్రంక్ అండ్ డ్రైవ్ ఫైన్లు	రూ.1.64 కోట్లు	5.70 కోట్లు	11.05 కోట్లు

మహా కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం : మహా కుంభమేళాకు వెళ్లే భక్తులు, తీర్థయాత్రికుల కోసం పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

- తిరుపతి-బనారస్(07107) స్పెషల్ రైలు జనవరి 18, ఫిబ్రవరి 8, 15, 22వ తేదీల్లో (శనివారం) రాత్రి 8.55 గంటలకు తిరుపతిలో బయల్దేరి మరుసటి రోజు (ఆదివారం) ఉదయం 10.58 గంటలకు దువ్వాడకు, సోమవారం మధ్యాహ్నం 3.45 గంటలకు బనారస్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బనారస్-విజయవాడ(07108) స్పెషల్ రైలు జనవరి 20, ఫిబ్రవరి 10, 17, 24వ తేదీల్లో (సోమవారం) సాయంత్రం 5.30 గంటలకు బనారస్‌లో బయల్దేరి మంగళవారం రాత్రి 11.23 గంటలకు దువ్వాడకు, బుధవారం తెల్లవారు 5.30 గంటలకు విజయవాడ చేరుకుంటాయి.
- నరసాపూర్-బనారస్(07109) స్పెషల్ రైలు జనవరి 26, ఫిబ్రవరి 2వ తేదీల్లో (ఆదివారం) ఉదయం 6 గంటలకు నరసాపూర్‌లో బయల్దేరి అదేరోజు ఉదయం 10.58 గంటలకు, సోమవారం మధ్యాహ్నం 3.45 గంటలకు బనారస్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బనారస్-నరసాపూర్(07110) స్పెషల్ రైలు జనవరి 27 ఫిబ్రవరి 3వ తేదీల్లో (సోమవారం) సాయంత్రం 5.30 గంటలకు బనారస్‌లో బయల్దేరి, మరుసటిరోజు (మంగళవారం) రాత్రి 11.23 గంటలకు దువ్వాడకు, బుధవారం తెల్లవారు 5 గంటలకు నరసాపూర్ చేరుకుంటుంది.

పలు రైళ్ల నంబర్ల మార్పు

తాటిచెట్లపాలెం: ఇప్పటివరకు మెము స్పెషల్, పాసింజర్ స్పెషల్స్‌గా నడిచిన పలు రైళ్లు జనవరి 1వ తేదీ నుంచి కొత్త రైలు నెంబర్లతో రెగ్యులర్ పాసింజర్ రైళ్లుగా ప్రయాణించనున్నాయి.

రైలు పేరు	పాత నంబరు	కొత్త నంబరు
కటక్-గుణుపూర్ పాసింజర్	08421	68433
గుణుపూర్-కటక్ పాసింజర్	08422	68434
విశాఖపట్నం -కిరండూల్ పాసింజర్	08551	58501
కిరండూల్-విశాఖపట్నం పాసింజర్	08552	58502
విశాఖపట్నం-రాయ్‌పూర్ పాసింజర్	08528	58528
రాయ్‌పూర్-విశాఖపట్నం పాసింజర్	08527	58527
విశాఖపట్నం-కోరాపుట్ పాసింజర్	08546	58538
కోరాపుట్-విశాఖపట్నం పాసింజర్	08545	58537
విశాఖపట్నం-బ్రహ్మపూర్ పాసింజర్	08531	58532
బ్రహ్మపూర్-విశాఖపట్నం పాసింజర్	08532	58531
విశాఖపట్నం-గుణుపూర్ పాసింజర్	08522	58506
గుణుపూర్-విశాఖపట్నం పాసింజర్	08521	58505
విశాఖపట్నం-భవానిపట్న పాసింజర్	08504	58504
భవానిపట్నం-విశాఖపట్నం పాసింజర్	08503	58503

అప్పన్న భక్తులకు దేవస్థానం ఉద్యోగి టోకరా

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు అంతరాలయ దర్శనం పేరిట డబ్బులు తీసుకుని, టోకరా వేసిన దేవస్థానం ఉద్యోగి చర్య ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ నుంచి దిలీప్‌కుమార్ అనే భక్తుడు కుటుంబ సభ్యులు ఐదుగురితో కలిసి సింహగిరికి ఈ నెల 28(శనివారం) మధ్యాహ్నం 2 గంటల సమయంలో వచ్చారు. ఆ సమయంలో దేవస్థానంలో పనిచేస్తున్న 4వ తరగతి ఉద్యోగి దిలీప్‌కుమార్‌కు తారసపడ్డాడు. తాను అంతరాలయ దర్శనం కల్పిస్తానని రూ.300లు చొప్పున ఆరుగురికి రూ.1,800లు తీసుకున్నాడు. నగదు తీసుకుని వారంతా తనవాళ్లేనని రూ.300 టికెట్ క్యూలో విధుల్లో ఉన్న సిబ్బందికి చెప్పి వారిని పంపించాడు. వీరంతా నీలాద్రిగుమ్మం వద్ద అంతరాలయంలోకి ప్రవేశించేందుకు ఉపక్రమించగా అక్కడ ఉన్న సిబ్బంది వారిని అడ్డుకుని టికెట్ అడిగారు. దేవస్థానం ఉద్యోగే పంపించారని భక్తులు చెప్పడంతో అతను వచ్చి చెప్పాలని, లేదంటే టికెట్ ఉండాలని సిబ్బంది చెప్పారు. దీంతో మోసపోయినట్లు తెలుసుకున్న దిలీప్‌కుమార్ ఆరా తీశారు. తమను మోసం చేసింది దేవస్థానంలో శానిటేషన్ విభాగంలో పనిచేసే ఉద్యోగి అని తెలుసుకుని, పీఆర్వో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్టాబ్లిష్‌మెంట్ ఏఈవోను వివరణ కోరగా పీఆర్వో కార్యాలయం నుంచి ఫిర్యాదు ఇంకా తన వద్దకు రాలేదని, రాగానే చర్యలు తీసుకుంటానని తెలిపారు.

అంతా మా ఇష్టం..!

- మైనర్‌ను మోసం చేసి పెళ్లి చేసుకున్నాడని ఫిర్యాదు
- ప్రతి రోజు దారుణంగా హింసిస్తున్నాడని చెప్పినా చర్యలు శూన్యం
- కేసు నమోదు చేయకపోవడంతో సీపీని ఆశ్రయించిన బాధిత కుటుంబ సభ్యులు
- అలాగే సెల్ పోయిన కేసులో బాధితుడి నుంచి డబ్బులు డిమాండ్
- త్రీ టౌన్ పోలీసుల తీరుపై ఆరోపణలు



విశాఖ సిటీ: మైనర్‌ను మోసం చేసి పెళ్లి చేసుకున్నాడని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ప్రతి రోజు దారుణంగా రక్తం వచ్చేలా కొడుతూ హింసిస్తున్నాడని మొరపెట్టుకున్నా మనసు కరగలేదు. ప్రతి రోజు స్టేషన్ చుట్టూ బాధితురాలి తల్లిదండ్రులు తిరుగుతున్నా ఆ ఖాకీల మనసులు చలించ లేదు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు నేరుగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చిని ఆశ్రయించారు. అలాగే మరో కేసులో మొబైల్ పోయిందని ఫిర్యాదు చేసిన బాధితుడ్నే డబ్బులు డిమాండ్ చేస్తూ వేధింపులకు గురి చేయడం గమనార్హం. ఆ స్టేషన్‌కు వెళ్లే బాధితులకు న్యాయం చేయకపోగా..వారి నుంచే డబ్బులు డిమాండ్ చేస్తుండడం ఇపుడు హాట్ టాపిక్‌గా మారింది.

ఇదేనా మహిళలకు భద్రత..?

ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సీపీ వరకు మహిళల భద్రతకు పెద్దపీట వేస్తామని చెప్పుకొస్తున్నారు. వారు చెప్పే మాటలకు, స్టేషన్లలో సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుకు పొంతన ఉండడం లేదు. ఒక మైనర్‌ను మోసం చేసి పెళ్లి చేసుకొని రోజూ హింసిస్తున్నా.. పోలీసులు పట్టించుకోకపోవడమే ఇందుకు నిదర్శనం. మైనర్‌ను పెళ్లి చేసుకోవడమే చట్టరీత్యా నేరం. పెళ్లి తరువాత కూడా రక్తం వచ్చేలా హింసించినా..వారిపై చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

సీపీని ఆశ్రయించిన బాధితురాలు

చినవాల్తేరు రెల్లివీధికి చెందిన చెందిన మైనర్ (17) అక్కడి ప్రభుత్వ పాఠశాలలో చదివేది. ఏయూ అవుట్‌గేట్ ప్రాంతంలో ఉంటున్న శివకుమార్ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తూ బాలికను పాఠశాల వద్ద పరిచయం చేసుకున్నాడు. రోజు స్కూల్ నుంచి ఇంటికి తీసుకువెళ్లే క్రమంలో ప్రేమ పేరుతో దగ్గరయ్యాడు. గతేడాది మాయమాటలు చెప్పి బాలికను తగరపువలసకు తీసుకెళ్లాడు. తరువాత శొంఠ్యాం తీసుకొచ్చి గతేడాది జూన్ 20వ తేదీన ఓ ఆలయంలో వివాహం చేసుకున్నాడు. అనంతరం అక్కడి నుంచి పెదవాల్తేరుకు తీసుకువచ్చాడు. కొద్ది రోజుల తరువాత శివకుమార్ బండారం బయటపడింది. అంతకు ముందే అతడికి పెళ్లి అయినట్లు బాలికకు తెలిసింది. దీనిపై ఆమె శివకుమార్‌ను ప్రశ్నించగా.. అతడు తీవ్రంగా కొట్టాడు. దీంతో భయపడి ఆమె తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోయింది. వారు మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న శివకుమార్ బాలిక తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో వెళ్లి ఆమెకు మాయమాటలు చెప్పి ఇంటికి తీసుకెళ్లిపోయాడు. పెద్దలు, లాయర్ సమక్షంలో రాజీ చేసుకున్నాడు. కొద్ది రోజుల తరువాత మళ్లీ వేధింపులు ప్రారంభమయ్యాయి. ఈ నెల 28వ తేదీ సాయంత్రం 7 గంటలకు శివకుమార్ మొదటి భార్య అకారణంగా బాలికను కొట్టింది. ఈ విషయాన్ని శివకుమార్‌తల్లిదండ్రులకు చెప్పగా.. వారు కూడా దారుణంగా కొట్టారు. శివకుమార్ తండ్రి రమేష్ పెట్రోల్ పోసి చంపుతానని బెదిరించడంతో ఆమె భయంతో 28వ తేదీ రాత్రి 9 గంటలకు మూడో పట్టణ పోలీసులను ఆశ్రయించగా.. వారు కనీసం పట్టించుకోలేదు. దీంతో ఆమె తన తల్లిదండ్రులతో కలిసి మళ్లీ మరుసటి రోజు ఉదయం స్టేషన్‌కు వెళ్లింది. కానీ వారి నుంచి స్పందన లేకపోవడంతో వారు సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చికి ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ చర్యలు తీసుకుంటామని బాధితురాలికి, ఆమె కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.

బాధితుడికే డబ్బులు డిమాండ్

తమకు న్యాయం చేయాలని త్రీ టౌన్‌కు వచ్చే బాధితుల జేబులకే సిబ్బంది చిల్లులు పెడుతున్నారు. మొబైల్ ఫోన్ పోయిందని ఫిర్యాదు చేసిన బాధితుడికే ఫోన్ చేసి డబ్బులు ఇవ్వకపోతే ఫోన్ రాదంటూ చెప్పడం విశేషం. లోకేష్ అనే యువకుడు తన ఫోన్ పోయిందని త్రీ టౌన్‌కు వెళ్లాడు. ఫిర్యాదు స్వీకరించడానికే పోలీసులు రెండు రోజులు తిప్పారు. దీంతో లోకేష్ ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేశాడు. ఇటీవల త్రీ టౌన్ నుంచి మాట్లాడుతున్నామని మొబైల్ దొరికిందని అతడికి ఫోన్ వచ్చింది. దీంతో లోకేష్ స్టేషన్‌కు వెళ్లి సిబ్బందిని కలిశాడు. ఫోన్ కేరళలో ఉందని, అక్కడి నుంచి రప్పించాలంటే డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబ్బులు అంటే కొరియర్ చెయ్యడానికి ఏమో అనుకున్న బాధితుడు సరే అని రూ.200 ఇచ్చాడు. అది చూసి అక్కడి సిబ్బంది సీరియస్ అవుతూ.. రూ.వేలు ఇవ్వకపోతే పని కాదని తేల్చి చెప్పారు. కనీసం రూ.10 వేలు అయినా ఇవ్వాలంటూ బేరమాడారు. అంత ఇవ్వలేనని చెప్పి ఇంటికి వెళ్లిపోయాడు. కొద్ది రోజుల తరువాత మళ్లీ బాధితుడు హోంగార్డు కిరణ్‌కుమార్ ఫోన్ చేయగా.. రూ.8 వేలు ఇస్తేనే ఫోన్ వస్తుందని చెప్పారు. తన వద్ద అంత డబ్బు లేదని చెప్పగా.. రూ.6 వేలు ఇవ్వాలని బేరమాడారు. దీన్ని బాధితుడు ఫోన్‌లో రికార్డు చేశాడు. ఈ ఆడియో క్లిప్పింగ్‌తో సహా బాధితుడు సాక్షి టీవీని ఆశ్రయించాడు. టీవీలో ఆడియో క్లిప్పింగ్ ప్రసారం కావడంతో సీపీ శంఖబ్రత అంతర్గత విచారణ చేపట్టి హోంగార్డు కిరణ్‌ను సస్పెండ్ చేశారు.

మిట్టల్ స్టీల్ ప్లాంట్‌తో పర్యావరణానికి చేటు



సమావేశంలో మాట్లాడుతున్న సీహెచ్ నరసింగరావు

దాబాగార్డెన్స్: ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు నక్కపల్లి ప్రాంతానికి పర్యావరణపరంగా అత్యంత చేటు అని 2000 సంవత్సరంలోనే నిపుణుల కమిటీ నిర్ధారించిందని, అలాంటి చోట కూటమి ప్రభుత్వం మిట్టల్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు పాకులాడటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు సిటు రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీహెచ్ నర్సింగరావు మండిపడ్డారు. జగదాంబ జంక్షన్ సమీపాన గల నండూరి ప్రసాదరావు భవన్‌లో సోమవారం సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్‌తో కలిసి మీడియాతో ఆయన మాట్లాడారు. విశాఖ స్టీల్ అమ్మకాలను దెబ్బతీసి మిట్టల్‌కు అప్పగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయన్నారు. విశాఖ చెన్నై పెట్రోలియం, పెట్రో కారిడార్ ఏర్పాటుకు 2000 సంవత్సరంలో ప్రజాభిప్రాయ సేకరణలో నక్కపల్లి పోర్టుపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన కమిటీ అక్కడి పోర్టును తిరస్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పుడు అంబానీ రిలయన్స్ కోసం, ఇప్పుడు మిట్టల్ కోసం రాష్ట్ర ప్రభుత్వం నిస్సిగ్గుగా ప్రయత్నిస్తోందని ఆరోపించారు. జనవరి 8న మోదీకి స్టీల్ నిరసన సెగ తెలిసేలా.. చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

30 ఏళ్లుగా అదనపు చెల్లింపులు

30 ఏళ్ల నుంచి సొంత గనులు లేకుండా విశాఖ స్టీల్ నడుస్తోందని, ఇనుప ఖనిజం కోసం ఇతర స్టీల్‌ప్లాంట్‌ల కంటే అదనంగా ఏటా రూ.3 వేల కోట్లు ఖర్చు పెట్టాల్సి వస్తోందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనుల కోసం కేంద్రంపై ఒత్తిడి చేస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు వాగ్దానం చేసి, ఇప్పుడు మిట్టల్‌కు సొంతగనులు, పర్యావరణ అనుమతుల కోసం పాకులాడడం దుర్మార్గమన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి



మహిళను ఈడ్చుకెళ్తున్న పోలీసులు



నిరసన తెలుపుతున్న వామపక్షాలు

దాబాగార్డెన్స్: పార్లమెంట్ వేదికగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలంటూ వామపక్షాలు నిరసనకు దిగాయి. డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టాయి. అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించగా, పోలీ సులు అడ్డుకున్నారు. దీంతో ఆ దిష్టిబొమ్మను ముక్కలు ముక్కలుగా చేశారు. కొంత సేపు పోలీసులు, వామపక్ష నాయకుల మధ్య తోపులాట జరగడంతో కార్యకర్తలకు చిన్నపాటి గాయాలయ్యాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను, దాన్ని సమర్థించిన ప్రధాని మోదీపై పోలీసులు కేసులు పెట్టకుండా, వామపక్ష పార్టీలపై విరుచుకుపడడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీపీఐ కేంద్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఏజే స్టాలిన్, సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.మణి, సీపీఐఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు వై కొండయ్య, ఎస్‌యూసీఐసీ రాష్ట్ర నాయకుడు గోవిందరాజులు, సీపీఐఎంఎల్ ప్రజాపోరు దేవా, నాయకులు కృష్ణారావు, పి చంద్రశేఖర్, ఎం.సుబ్బారావు, ఎం.వెంకటేశ్వర్లు, వై.రాజు, ఎం.లక్ష్మి, పి.వెంకట్రావు, కె.కుమారి పాల్గొన్నారు.

జీవీఎంసీ పీజీఆర్ఎస్‌కు 89 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జీవీఎంసీ కమిషనర్

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 89 వినతులు వచ్చాయి. కమిషనర్ సంపత్‌కుమార్ ఫిర్యాదులు స్వీకరిస్తూ పరిష్కారానికై సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చిన వినతుల్లో జోన్-1 నుంచి 2, జోన్-2 నుంచి 15, జోన్-3 నుంచి 13, జోన్-4 నుంచి 6, జోన్-5 నుంచి 15, జోన్-6 నుంచి 15, జోన్-8 నుంచి 10 అందగా, ప్రధాన కార్యాలయానికి సంబంధించి 13 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, వెంటనే అధికారులు స్పందించి కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ, ఆర్ సోమన్నారాయణ, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, డీసీఆర్ ఎస్.శ్రీనివాస్ పలువురు అధికారులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చే అర్జీల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఆదేశించారు. పదే పదే వచ్చే ఫిర్యాదులపై దృష్టి సారించాలని, వాటి పరిష్కారంలో ప్రజలతో జిల్లా స్థాయి అధికారులే నేరుగా ఫోన్‌లో మాట్లాడాలని సూచించారు. ఫిర్యాదుదారు సంతృప్తి చెందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ వినతులు స్వీకరించారు. గత వారం వచ్చిన ఫిర్యాదులు, తీసుకున్న చర్యలపై సమీక్షించిన ఆయన వివిధ అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. నిర్ణీత గడువులో అర్జీలు పరిష్కరించాలని, వినతులు మళ్లీ మళ్లీ రీ ఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని చెప్పారు. సీఎంవో గ్రీవెన్స్ పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. అంతర్ శాఖల మధ్య ఉన్న సమస్యల పరిష్కారానికి సమన్వయం వహించాలన్నారు. అర్జీలు సమర్పించేందుకు వచ్చిన ప్రజలకు అధికారులు ప్రత్యేక వసతులు కల్పించారు. ఆలస్యం కాకుండా అధిక సంఖ్యలో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయడంతో పాటు, తాగునీటి సదుపాయం కల్పించారు. వివిధ సమస్యలపై 236 వినతులను అధికారులు స్వీకరించారు. వాటిలో రెవెన్యూ విభాగానికి 101, జీవీఎంసీకి 39, పోలీసు శాఖకు సంబంధించి 23, ఇతర శాఖలకు సంబంధించి 73 ఉన్నాయి. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, ఆర్డీవో పి. శ్రీలేఖ, జీవీఎంసీ సిటీ ప్లానర్ ధనుంజయ రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన మార్గశిర మాసోత్సవాలు



దీపాల నడుమ కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: నెల రోజులుగా జరుగుతున్న బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసో త్సవాలు సోమవారం ముగిశాయి. చివరి రోజున అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ అర్చకులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు, సహస్రనామార్చనలు జరిపారు. సాయంత్రం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అమ్మవారి మాలధారణ చేసిన భక్తుల కోసం మహాపూర్ణాహుతి నిర్వహించారు. మాలధారణ భక్తులు అమ్మవారిని దర్శించుకుని, దీక్షను విరమించారు. మార్గశిర మాసోత్సవాల ముగింపు సందర్భంగా సహస్రదీపాలంకరణ సోమవారం సాయంత్రం నిర్వహించారు. బురుజుపేట బృందం కళానైపుణ్యంతో దీపాలంకరణ చేపట్టారు.

ఉత్సాహంగా ఫిట్ ఇండియా పోటీలు



విజేత విద్యార్థులతో ఎమ్మెల్యే గణబాబు, సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ స్పోర్ట్స్: పాఠశాల స్థాయిలో క్రీడలు, ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించేందుకు నిర్వహించిన ఫిట్ ఇండియా క్రీడా వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. గోపాలపట్నం సాయ్ ఇండోర్ స్టేడియంలోనూ, ఎల్లపువానిపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో ఈ పోటీలు జరిగాయి. 6-8 తరగతి బాలబాలికలకు, 9-10 తరగతి బాలికలకు పలు క్రీడాంశాలతో పాటు సరదా ఆటలు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పాల్గొన్నారు. పోటీలకు సాయ్ సెంటర్ మాజీ పర్యవేక్షకుడు, వాలీబాల్ కోచ్ సత్యనారాయణ ఆధ్వర్యంలో కోచ్‌లు తిరుపతి, అచ్యుత్‌తో సహా పలువురు కోచ్‌లు సహకారం అందించారు. కార్యక్రమంలో ద్రోణాచార్య అవార్డీ వేంకటేశ్వరరావు, ది ఒలింపిక్ సంఘం కార్యదర్శి సూర్యనారాయణ, డీఎస్‌డీవో జూన్‌గాలియట్ పాల్గొన్నారు.

విజేతలు వీరే..

క్యారమ్ జూనియర్ బాలురలో భవాని ప్రసాద్, సీనియర్స్‌లో సోను, జూనియర్ బాలికల్లో హేమశ్రీ, సీనియర్స్‌లో అనూష విజేతలుగా నిలిచారు. డ్రాయింగ్‌లో గీతిక, వ్యాసరచనలో గాయత్రి, జూనియర్ బాలుర చదరంగంలో శశాంక్, సీనియర్స్‌లో శుభ్రాంసుదాస్, కబడ్డీ సీనియర్స్‌లో హేమంత్ జట్టు, జూనియర్స్‌లో అరవింద్ జట్టు, బాలికల్లో శ్రీప్రీతి జట్టు విజేతలుగా నిలిచాయి. ఖోఖో సీనియర్ బాలికల్లో మాధురి జట్టు, జూనియర్స్‌లో ప్రసన్న జట్టు, వాలీబాల్ బాలురలో హేమంత్ జట్టు, బాలికల్లో శ్రీరేష్మ జట్టు విజేతలుగా నిలిచాయి. బాల్‌బ్యాడ్మింటన్ బాలికల్లో సంజన జట్టు విజేతలుగా నిలిచింది. షాట్‌పుట్ సీనియర్స్‌లో సిద్దేశ్వర్, రవితేజ, బాలికల సీనియర్స్‌లో నాగదీప్తి, అమీనా, జూనియర్స్‌లో అనూష, రూప తొలి రెండు స్థానాల్లో నిలిచారు.

రుషికొండకు పర్యాటకుల తాకిడి



తీరంలో పర్యాటకుల సందడి

ఏయూక్యాంపస్ : అందాల రుషికొండ బీచ్‌కు సందర్శకుల తాకిడి పెరిగింది. వివిధ రాష్ట్రాలకు చెందిన పర్యాటకులు వారం రోజులుగా తరలివస్తున్నారు. సబ్‌మెరైన్ మ్యూజియం, టీయూ-142 యుద్ధవిమానం, మ్యూజియం, వీఎంఆర్‌డీఏ పార్క్, తెన్నేటిపార్క్, కైలాసగిరి ప్రాంతాలను వీరు సందర్శిస్తున్నారు. కొద్ది రోజులుగా జరుగుతున్న నేవీ విన్యాసాల నేపథ్యంలో ఆర్.కె.బీచ్ నుంచి వైఎంసీఏ వరకు పలు ప్రాంతాలలో ఆంక్షలు విధించడంతో పర్యాటకులు రుషికొండ తీరం వైపు అడుగులు వేస్తున్నారు. జనవరి 4వ తేదీ వరకు నావికాదళ విన్యాసాల నేపథ్యంలో రుషికొండ తీరమే బెస్ట్ ఆప్షన్‌గా పర్యాటకులు ఎంచుకుంటున్నారు.

భూముల విలువ పెంపు వాయిదా

మహారాణిపేట: జిల్లాలో భూముల విలువ పెంపును వాయిదా వేశారు. ముందు అనుకున్న ప్రకారం జనవరి ఒకటో తేదీ నుంచి జిల్లాలో పెరిగిన భూ విలువలు అమల్లోకి రావాల్సి ఉంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు దీన్ని వాయిదా వేస్తున్నట్టు జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ బాలకృష్ణ సోమవారం మీడియాకు వెల్లడించారు.

ఏయూ విద్యార్థినితో అసభ్య ప్రవర్తన..?

విశాఖ విద్య: చెన్నై ఎస్ఆర్ఎం వర్సిటీలో జరిగిన యూత్ ఫెస్టివల్ టూర్‌కు వెళ్లిన బృందంలోని విద్యార్థినిపై ఓ వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించినట్లు సోమవారం ఆంధ్ర యూనివర్సిటీలో విస్తృతంగా ప్రచారం సాగింది. యూత్ ఫెస్టివల్‌కు ఆంధ్ర యూనివర్సిటీ నుంచి 25 మంది విద్యార్థుల బృందం ఈ నెల 26న చెన్నైకు వెళ్లింది. సోమవారం వారంతా తిరుగుప్రయాణమయ్యారు. వర్సిటీకి చెందిన ఓ వ్యక్తి తనతో అసభ్యకరంగా ప్రవర్తించాడని ఆరోపిస్తూ బాధిత విద్యార్థిని ఏయూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు వర్సిటీలో ప్రచారం జరిగింది. యూత్ ఫెస్టివల్ విద్యార్థుల బృందం ప్రయాణించే బస్సుల్లో శృతిమించిన సినిమా పాటలతో కొంతమంది డ్యాన్స్‌లు చేసిన వీడియో ఒకటి వర్సిటీ ఆచార్యుల వాట్సప్ గ్రూపుల్లో చక్కర్లు కొట్టింది. ఇలాంటి ప్రవర్తనలతో బస్సులో ప్రయాణించే మిగతా విద్యార్థినులు తీవ్ర ఇబ్బందికి గురయ్యారని, వారే వాటిని చిత్రీకరించి ఇక్కడి ఆచార్యులకు పంపించినట్లుగా తెలుస్తోంది. దీనిపై యూత్ ఫెస్టివల్‌కు టీమ్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్న జీకేడీ ప్రసాద్‌ను 'సాక్షి' వివరణ కోరగా అలాంటిదేమీ లేదని, వర్సిటీలో ఎవరో గిట్టనివారు చేస్తున్న తప్పుడు ప్రచారమన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఐఐఎంవీ ఆహ్వానం

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరంలోని ఐఐఎంవీ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను ప్రారంభించింది. ఇందులో భాగంగా మూడు విభిన్నమైన కార్యక్రమాల ద్వారా శిక్షణకు ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ, మహిళా పారిశ్రామికవేత్తలు, దివ్యాంగులు, మాజీ సైనికులు, బలహీన వర్గాలను ఆహ్వానిస్తోంది. శిక్షణా కాలంలో వీరికి ఐఐఎంవీలో వసతి, భోజనం సమకూర్చనున్నారు. ప్రయాణ ఖర్చులు అభ్యర్థులే భరించుకోవాలి. ఆసక్తి కలిగిన అభ్యర్థులు జనవరి 5లోగా దరఖాస్తు చేసుకోవాలి. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందిస్తారు. వివరాలకు ఐఐఎంవీకి సంబంధించిన IIMV FIELD వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు. ఇతర వివరాలకు incubationcenter@iimv.ac.in లేదా 917569 309208 వాట్సప్ నంబరు ద్వారా సంప్రదించవచ్చు. వీటిలో ఎంఎండీపీ ఫౌండర్స్ లాంచ్‌పాడ్ గ్రోత్ అండ్ యాక్సలరేషన్ స్ట్రాటజీస్‌లో ఆరు రోజుల శిక్షణను జనవరి 17 నుంచి 22 వరకు నిర్వహించనున్నారు. ఇందులో 25 మందికి అవకాశం ఉంది. నిర్వహణ, ఫైనాన్స్ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఎంఎండీపీ పాలసీ లీడర్‌షిప్ 2025 శిక్షణ ఫిబ్రవరి 24 నుంచి మార్చి 1 వరకు ఉంటుంది. ఈ శిక్షణలో ఎంపికైన 25 మందికి డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, అనలిటిక్స్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్ వంటి లక్ష్యాలను వివరిస్తారు. ఏఈఎస్‌డీపీనేవిగేటింగ్ జర్నీ విజన్ టు వెంచర్ బిల్డింగ్ శిక్షణలో 20 మందికి మార్చి 3 నుంచి 7 వరకు శిక్షణ ఉంటుంది. వ్యాపార మోడలింగ్ సాధనాలు, వ్యవస్థాపక ఫ్రేమ్‌వర్క్‌లపై శిక్షణ ఇవ్వనున్నారు.

కృష్ణాగార్డెన్స్‌లో డయేరియా

- 150 మందికి పరీక్షలు
- 17 మందికి వ్యాధి నిర్ధారణ

దాబాగార్డెన్స్: నియోజకవర్గంలో డయేరియా విజృంభిస్తోంది. గత నెలలో 37వ వార్డు జబ్బర్‌తోటలో విజృంభించిన డయేరియాతో పలువురు ఆస్పత్రి పాలవ్వగా..ఇద్దరు కిడ్నీ ఇన్ఫెక్షన్‌కు గురయ్యారు. తాజాగా జీవీఎంసీ 33వ వార్డు పరిధి కృష్ణాగార్డెన్స్‌లో డయేరియా సోకింది. దీంతో అప్రమత్తమైన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆధ్వర్యంలో సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. 150 మందికి పరీక్షలు నిర్వహించగా, 17 కేసులు నిర్ధారణ అయ్యాయి. వీరిలో ఒకరు ఐసీయూలో ఉండగా, మిగిలిన వారిలో పలువురు ఇంట్లో, మరికొందరు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

4 నుంచి జీతాల కోసం 'ఉక్కు' పోరాటం

ఉక్కునగరం : ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో జనవరి 4న చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించనున్నారు. సోమవారం సాయంత్రం స్టీల్ ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో జరిగిన కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. 5న అన్ని నిర్వాసిత కాలనీల్లో పాదయాత్రలు చేయనున్నారు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలని, స్టీల్‌ప్లాంట్ సెయిల్‌లో విలీనం చేయాలన్న డిమాండ్లపై 6వ తేదీ ఉదయం నుంచి 8 తేదీ ఉదయం వరకు 48 గంటలు నిరాహార దీక్షలు..కొంతమంది ఆమరణ నిరాహార దీక్షలకు దిగనున్నట్టు తెలిపారు. కమిటీ కో కన్వీనర్ నీరుకొండ రామచంద్రరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, సీహెచ్. నర్సింగరావు, అయోధ్యరామ్, కె.ఎస్.ఎన్. రావు, యు. రామస్వామి, బొడ్డు పైడిరాజు, రామ్మోహన్‌కుమార్, బి. డేవిడ్, వరసాల శ్రీనివాసరావు, బంటు రాము, కోరాడ వెంకటరావు, పల్లా పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ఘోర ప్రమాదం



ఎండాడ ఏసీపీ కార్యాలయంలోకి దూసుకుపోయిన వాహనం

పీఎం పాలెం: ఎండాడ జాతీయ రహదారిపై సోమవారం ఘోర ప్రమాదం తప్పింది. విశాఖ నార్త్ డివిజన్ సీఐ సాయి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆనందపురంలో బేవరేజ్ నుంచి మద్యం బాటిళ్లను సాగర్‌నగర్‌లోని వైన్ షాప్‌నకు బొలేరో వాహనం తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఎండాడ కూడలి వద్దకు వచ్చే సరికి వాహనానికి బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. అప్పటికే రెడ్ సిగ్నల్ పడడంతో వాహనాలు బారులుదీరాయి. డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించి వాహనాన్ని ఎండాడ ఏసీపీ కార్యాలయ ప్రాంగణం వైపునకు మళ్లించాడు. ఫెన్సింగ్, అక్కడే ఉన్న చెట్టును వాహనం ఢీ కొట్టి ఆగి పోయింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనం పై ఉన్న ఇద్దరికి స్వల్ప గాయలయ్యాయి. వారిని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అదే సిగ్నల్స్ వైపునకు వాహనం వెళ్లి ఉంటే పెద్ద ప్రమాదమే జరగేదని సీఐ పేర్కొన్నారు.

నేటి నుంచి ఆర్జిత సేవలు బంద్

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం నుంచి వచ్చే నెల 9 వరకు అధ్యయనోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్టు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. రోజూ తెల్లవారుజామున స్వామికి ఆలయ బేడా మండపంలో తిరువీధి(అయ్యవారిసేవ) ఉంటుందని తెలిపారు. అలాగే జనవరి 10వ తేదీ నుంచి 20 వరకు రాపత్తు ఉత్సవాలు నిర్వహించనున్నామన్నారు. రాపత్తు ఉత్సవాల్లో ప్రతీరోజూ సాయంత్రం స్వామికి సింహగిరి మాడ వీధుల్లో రోజుకొక అలంకారంలో తిరువీధి ఉంటుందని తెలిపారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం నుంచి వచ్చేనెల 17వరకు ఆలయంలో జరిగే అన్ని ఆర్జిత సేవలు రద్దు చేసినట్టు పేర్కొన్నారు. రాపత్తు ఉత్సవాల రోజుల్లో రాత్రి 7గంటల వరకు మాత్రమే భక్తులకు దర్శనాలు లభిస్తాయి తెలిపారు.